పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 112. అల్ ఇఖ్లాస్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 4 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

సూరయె ఇఖ్‌లాస్ విశిష్ఠత :దీనికి గొప్ప విశిష్ఠత ఉంది. ఈ సూరా 1/3వ వంతు ఖుర్‌ఆన్‌కు సమానం అని దైవప్రవక్త (స) సెలవిచ్చారు. (సహీహ్ బుఖారీ – హ.నెం.4628) ఇంకా దీనిని రాత్రి చదవమని ఆయన (స) ప్రోత్సహించారు. (బుఖారీ) కొందరు సహాబాలు శుభం పొందాలన్న సంకల్పంతో ఇతర సూరాలతో కలిపి చదివేవారు. అందుకు దైవప్రవక్త (స) వారితో ఇలా చెప్పారు, “ఈ సూరా పట్ల మీకు గల ప్రేమే మిమ్మల్ని స్వర్గంలో ప్రవేశింపజేస్తుంది. (బుఖారీ). ముష్రికులు దైవప్రవక్త (స)ను అల్లాహ్ వంశావళిని వివరించమని కోరినప్పుడు అంటే ఆయనకు పిల్లలెందరు? ఆయన తండ్రి ఎవరు? అని అడిగినప్పుడు ఈ సూరా అవతరించబడింది. (ముస్నద్ అహ్మద్)

## 112. సూర అల్ ఇఖ్లాస్

**ఆయత్‌లు** : 4 **అవతరణ** : **మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) (ఓ ముహమ్మద్–స) చెప్పండి. అల్లాహ్ ఒక్కడు. (2) అల్లాహ్ నిరపేక్షాపరుడు (3) ఆయన ఎవరికీ తండ్రికాదు. (4) ఆయన ఎవరికీ కుమారుడూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు.

رُكُوعُهَا 1 — سُورَةُ الْإِخْلَاصِ مَكِّيَّةٌ 112 — آيَاتُهَا 4

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

قُلۡ هُوَ اللّٰهُ اَحَدٌ ﴿1﴾

اَللّٰهُ الصَّمَدُ ﴿2﴾

لَمۡ يَلِدۡ ۙ وَلَمۡ يُوۡلَدۡ ﴿3﴾

وَلَمۡ يَكُنۡ لَّهٗ كُفُوًا اَحَدٌ ﴿4﴾ ع 1 4 37

1 – 4 వాక్యాలు

“ఇఖ్లాస్” అన్నది కేవలం ఈ సూరా పేరు మాత్రమే కాదు. ఈ వ్యాసానికి శీర్షిక కూడా. ఇందులో కేవలం తౌహీద్ వివరించబడింది. మిగతా సూరాలలో ఆ సూరాలలో వచ్చిన పదాన్ని దాని పేరుగా నిర్ణయించడం జరిగింది. అయితే ఈ సూరాలో “ఇఖ్‌లాస్” అన్న పదం రాలేదు. సూరా అర్థాన్ని బట్టి ఈ పేరు నిర్ధారించబడింది. మక్కా ఖురైషులు దైవప్రవక్త (స) తో నీ ప్రభువు వంశక్రమాన్ని తెలుపమని కోరినప్పుడు ఈ సూరా అవతరించింది. అప్పటి మతభావనలు ఎలా ఉండేవంటే విగ్రహారాధకులు, బహుదైవారాధకులు కొయ్యతో, రాళ్ళతో, బంగారంతో, వెండితో ఇంకా ఇతర వస్తువులతో చేయబడిన విగ్రహాలను పూజించేవారు.

ముష్రికులలోని ఒక పెద్ద వర్గం దైవం మానవరూపంలో ప్రత్యక్షమవుతాడని దేవునికి అవతారాలున్నాయని నమ్మేవారు. క్రైస్తవులు దేవుడు ఒక్కడే అని నమ్మే వారయినప్పటికీ, వారి దైవం కనీసం ఒక కుమారుడు కలిగి ఉండేవాడు. యూదులు కూడా దేవుడు ఒక్కడే అని వాదించినా వారి దైవం కూడ భౌతికత, శరీరం కలిగి ఉండటం ఇంకా మానవ గుణాలు కలిగి ఉన్నాడు. ఒక కుమారుడు (ఉజైర్)కు తండ్రి, వారే కాక జొరాస్ట్రియన్లు అగ్నిని పూజించేవారు. సాబీలు నక్షత్రాలను పూజించేవారు.

ఇటువంటి పరిస్థితులలో, ఇతరులు సాటిలేని ఏకైక దైవాన్ని అంగీకరించమని ఆహ్వానించినప్పుడు వారికి అనేక సందేహాలు రావడం సహజం. అందరు ఆరాధ్యులను వదలి ఒకే ప్రభువును ఆరాధ్యునిగా చేసుకోవాలని సందేశమివ్వబడుతోంది. ఆ ప్రభువు ఎలాంటివాడు? దివ్య ఖుర్ఆన్‌కు ఆ గౌరవం దక్కింది. అది ఈ ప్రశ్నలకు జవాబును కొన్ని పదాలలో యిచ్చి, అల్లాహ్‌ను గురించి స్పష్టమైన భావనను పేర్కొంటూ ముష్రిక్‌లపరమైన భావనల్ని చెరిపివేసింది. ఆయనతో పాటు ప్రాణుల గుణాలలోని ఏ గుణాన్నీ చేర్చడానికి ఎటువంటి అవకాశమూ మిగల్చలేదు.

ఈ సూరా ఇస్లాం యొక్క ప్రాథమిక విశ్వాసాన్ని (తౌహీద్) మానవులకు వెంటనే బుర్రకెక్కేలా, సులభంగా నాలుకపైకెక్కే నాలుగు వాక్యాలలో తెలియచేస్తోంది. హదీసులలో అనేక ఉల్లేఖనాల ద్వారా తెలియజేయబడుతుంది. దైవప్రవక్త (స) వివిధ సందర్భాలలో అనేక విధాలుగా ఈ సూరా మూడవ వంతు ఖుర్ఆన్‌కు సమానమని ప్రజలకు తెలిపారు.